## వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా జహంగీర్

**ములుగు, జనవరి 17 (ప్రభాతవార్త):** ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా మండలకేంద్రమైన ములుగుకు చెందిన జహంగీర్ మూడోసారి నియామకమయ్యారు. ఉపాధ్యక్షునిగా మామిడ్యాల్ గ్రామానికి చెందిన కోదూరు భూపాల్‌రెడ్డి, డైరెక్టర్లుగా రాందాస్, కృష్ణమూర్తి, బాలయ్య, ఏసుగు బాపురెడ్డి, తిరుపతినాయక్, మహాలక్ష్మి, కుమార్‌యాదవ్, ప్రవీణ్‌చారి, బాలమణి, సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నిమ్మకాయల గణేష్, ఇక్రి రామకృష్ణారెడ్డి, హంస మహేష్‌యాదవ్‌లను నియమిస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జహంగీర్ సీఎం కెసిఆర్ చిన్ననాటి నుండి సన్నిహితంగా ఉంటూ ఉద్యమంలో కెసిఆర్‌తో పాటు తనవంతు పాత్ర పోషించారు. గత కొంతకాలంగా మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా ఉంటూ సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవతో వంటిమామిడి మార్కెట్‌యార్డును అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. ఆయన ముచ్చటగా మూడోసారి మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సంతోషదాయకంగా ఉందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక వర్గ నియామకం

**సిద్దిపేట రూరల్, జనవరి 17, ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో బండపై వెలిసియున్న సుప్రసిద్ధ క్షేత్రం శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలి నియామకం జరిగింది. ఆలయ నూతన పాలక వర్గాన్ని మంత్రి నియమించారు. ఎన్నో ఏళ్లుగా వంశ పారం పర్యంగా అర్చకులుగా కొనసాగుతు ఆలయ అభివృద్ధికి సేవలు చేస్తున్న పూజారి కలకుంట్ల రంగాచారిని చైర్మన్‌గా నియమించారు. అలాగే ఆలయ సేవలో ఒకప్పుడు కార్యకర్తలను పాలక మండలి సభ్యులుగా గుర్తింపునిచ్చారు. ఆధ్యాత్మికంలతోపాటు ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలన్నారు.

**ఆలయ నూతన పాలక వర్గం**

ఆలయ పూజారి సీనియర్ జర్నలిస్టు కలకుంట్ల రంగాచారిని ఆలయ చైర్మన్‌గా ఆలయ చైర్మన్‌గా నియమించారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా కలకుంట్ల వెంకట నర్సింహచారి, సభ్యులుగా కోదూరి శ్రీనివాస్‌గౌడ్, జిల్లెల సుధాకర్, ములుగు లక్ష్మీమల్లేశం, సీతగొల్ల శ్రీనివాస్, గొడుగు అంజయ్య, కుంచం బాలయ్యను సభ్యులుగా నియమించారు.



మాట్లాడుతున్న అడిషన్ ఎస్పీ ఉషా విశ్వనాథ్

## మామిడ్గిలో సిసి కెమెరాలను ప్రారంభించిన అడిషనల్ ఎస్పీ

**న్యాల్‌కల్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర సరిహద్దులో మండలం లోని మామిడ్గి గ్రామంలో మంగళవారం 2లక్షల 30వేల రూపాయలతో ఏర్పాటు చేసిన 16 సిసి టీవి కెమెరాలను జిల్లా అడీషనల్ ఎస్పీ ఉషా విశ్వనాథ్ పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భం గా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామస్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయితీ బాధ్యులు సీసీ టీవి కెమారాల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. మామిడ్గి పంచాయితీని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని ప్రతి పంచాయితీలో సీసీ టీవిలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ టీవిలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉంటే నేరాలు తగ్గుముఖం పట్టణం తధ్యమన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో తిరిగాడుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని వివరించారు. మట్కా, జూదం ఆటలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ డిఎస్‌పి రఘు, జహీరాబాద్ రూరల్ సిఐ నోముల వెంకటేశ్, హద్నూర్, రాయికోడ్ పోలీసు ఠాణాల ఎస్ఐ వినయ్‌కుమార్, ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ చంద్రన్న, మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి, మెటల్‌కుంట సర్పంచ్ పీటర్ రాజు, ఉప సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, నాయకులు తుక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన సిద్దిపేట విద్యార్థి శ్రీవర్షిణి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



శ్రీవర్షిణికి జాతీయస్థాయి ఆహ్వానపత్రం, విమానటికెట్ అందిస్తున్న దృశ్యం

నెహ్రూ యువ కేంద్రం సిద్దిపేట యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ చదువుతున్న బి.శ్రీవర్షిణి జిల్లా స్థాయిలో ఎంపికైంది. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. శ్రీవర్షిణి తెలంగాణ రాష్ట్రం తరపున దేశ రాజధాని ఢిల్లో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 23న పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ప్రధాని మోడి సమక్షంలో మాట్లాడే అవకాశం దక్కింది. శ్రీవర్షిణికి భారత ప్రధాని మోడీ సమక్షంలో మాట్లాడే అవకాశం లభించడం పట్ల జిల్లా యువజన అధికారి మూల రంజిత్‌రెడ్డి, కార్యక్రమ అధికారి జి.కిరణ్‌కుమార్‌లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం దక్కడం కళాశాలకే కాకుండా రాష్ట్రానికే గర్వకారణమన్నారు. అనంతరం శ్రీవర్షిణికి జాతీయస్థాయి అహ్వాన పత్రంతో పాటు హైదారాబాద్ నుంచి ఢిల్లీకి ఢిల్లీ నుంచి తిరిగి హైదారాబాద్ రావడానికి విమాన టికెట్స్ అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.ప్రసాద్, కళాశాల ఐక్యూ ఏసీ కో-అర్డినేటర్ డా॥ మధుసూదన్, అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారులు డా॥ ఎం.శ్రద్ధానందం, డా॥ కె.రాణి, ఎన్.బైరయ్య తదితరులు పాల్గొని శ్రీవర్షిణిని అభినందించారు.

## పద్మనాభునిపల్లి గ్రామాభివృద్ధికి కృషి : ఎంపి



ఎంపి ప్రభాకర్‌రెడ్డి, జడ్పిటిసి రవీందర్‌రెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

**దుబ్బాక, జనవరి 17, ప్రభాతవార్త:** మండలపరిధిలోని పద్మనాభునిపల్లి గ్రామాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా వెనుకబడిన జాతుల అభివృద్ధి పరిచే దిశగా ఎస్సి కమిటీ హాల్ నిర్మాణం కోసం తక్షణమే రూ. 5లక్షల నిధులు మంజూరి చేశారు. మంజూరి పత్రాన్ని గ్రామ మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్‌కు అందజేశారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తాననీ హామీ ఇచ్చిన ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డిని, గ్రామాన్ని దత్తత తీసుకున్న జడ్పిటిసి కడతాల రవింధర్ రెడ్డిలను గ్రామ సర్పంచ్ కండ్లకొయ్య పర్శరాములు, మాజీ ఉప సర్పంచ్ స్వామి చరణ్, అంబెడ్కర్ సంఘం సభ్యులు కలసి శాలువాతో సన్మానించారు.

## ఈవిఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ అవరణ, ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మంగళవారం సీపీ శ్వేతతోకలిసి సందర్శించారు. అయన కలెక్టరేట్‌లోని పరిసరా ప్రాంతాలను కలియతిరిగి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సైన్ బోర్డులు, సెక్యూరిటీలో భాగంగా అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా నిర్మించిన ఈవీఎం గోదాంను పరిశీలించారు. అనంతరం హెలిపాడ్, కోర్టు భవనం, వెటర్నరీ కాలేజీకి ప్రతిపాదించిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రాజీవ్ రహదారి నుంచి భవనాలకు వెళ్లే రోడ్డు మార్గాన్ని త్వరగా మ్యాప్ రూపొందించి ఎస్టిమెంట్ వేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. అయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నూతనంగా నిర్మిస్తున్న ఈవీఎంల గోదాంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

# 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్**

**హుస్నాబాద్, జనవరి 17, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 19 నుండి మార్చి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన 11వార్డులోని కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించే శిబిరం కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. హుస్నాబాద్ పట్టణంలో దినసరి వార్డుల వారీగా నిర్వహిస్తున్న ప్రదేశాలను ప్రకటించారు. కంటి శిబిరంలో వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే శస్త్రచికిత్సలు అవసరమున్న వారికి నిర్వహించి కంటి అద్దాలను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమానికి సంబంధించి వార్డుల్లోని ప్రజలకు అవగాహన కల్పించి శిబిరానికి వచ్చేలా తోడ్పాటునివ్వాలని సూచించారు. ఈనెల 19న ఒకటవ వార్డులోని ప్రజలకు కస్తూరీబా కాలనీలో 24వరకు ఉచితంగా కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అలాగే అన్ని వార్డుల్లోనూ ఇదే పద్ధతిన శిబిరం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ చెప్పారు. రెండవ వార్డులో ఈ నెల 25 నుండి ఫిబ్రవరి 1 వరకు, వ్యవసాయశాఖ కార్యాలయం, మూడవవార్డులో ఫిబ్రవరి 2నుండి 8వరకు భారత్ పబ్లిక్ స్కూల్, నాలుగవ వార్డు అక్కన్నపేట రోడ్డులోని మైనార్టీ పాఠశాలలో ఫబ్రవరి 9 నుండి 15 వరకు, ఐదవ వార్డు లో సిపిఐ అనభేరి భవనంలో ఫిబ్రవరి 16 నుండి 21వరకు, ఆరవవార్డులో ఫిబ్రవరి 22నుండి 27వరకు శ్రీ రేణుకాఎల్లమ్మదేవాలయం ఆవరణ, ఏడవ వార్డులో 28నుండి మార్చి 6వరకు రాజ రాజేశ్వర ఫంక్షన్‌హాల్, ఎనిమిదవ వార్డులో మార్చి 3 నుండి 13 వరకు ఆరెపల్లిలోని ప్రైమరీస్కూల్, తొమ్మిదవ వార్డు మార్చి 14 నుండి 17 వరకు మహిళా సంఘం వాటర్‌ట్యాంకు దగ్గర, పదవ వార్డులో మార్చి 20నుండి 28వరకు పాత ఎంపిడివో కార్యాలయ భవనం, పదకొండవవార్డులో జనవరి 19నుండి 23వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పన్నెండవవార్డులో జనవరి 24నుండి జనవరి 30వరకు మత్స్యకారుల సంఘభవనంలో, పదమూడవవార్డులో జనవరి 31నుండి ఫిబ్రవరి 3వరకు గోదాంగడ్డ వ్యవసాయశాఖ కార్యాలం వద్ద, పధ్నాలుగవవార్డులో ఫిబ్రవరి 6నుండి 9వరకు సిద్దార్థ హైస్కూల్, పదిహేనవవార్డులో ఫిబ్రవరి 10నుండి 16వరకు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్, పదహారవవార్డులో ఫిబ్రవరి 17నుండి 22 వరకు అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాల, పదిహేడవ వార్డులో ఫిబ్రవరి 23నుండి మార్చి 1వరకు శ్రీసరస్వతిశిశుమందిర్ పాఠశాల, 18వ వార్డు లో మార్చి 2నుండి 13 వరకు కమ్యూనిటీ హాల్ బుడిగజంగాల కాలనీ, పందొమ్మిదవవార్డు మార్చి14నుండి 20వరకు రిటైర్డు ఉద్యోగుల భవనం, ఇరవైవార్డు మార్చి 21 నుండి 28 వరకు స్వర్ణకారుల సంఘభవనం కంటివెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజతవెంకన్న, వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సుంకె రాజమల్లయ్య, ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌జీవన్‌పాటిల్

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త :**

ప్రజలు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు భద్రతా నియమాలు పాటించాలని, ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చని మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం నాడు రామాయంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆమె ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ఆద్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నయమ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని సూచించారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాలవైపు నడుపుతున్న ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణం చేయరాదని, ఆటోలో ఎక్కువమంది పరిమితికి మించి ప్రయాణ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారనకు పోలీస్ శాఖ తరపున తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే ఇటీవలి కాలంలో అధికవడ్డీల వసూళ్లపై తమకు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీ వసూలు చేయడం వల్ల కొందరు పారిపోవడంతో పాటు ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుందని, అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాన్ బ్రోకర్స్ విషయంలో కూడా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. అంతేకాకుండా కొత్తగా వచ్చిన ఎస్ఐ రంజిత్ చేయాల్సిన విధివిధానాల గురించి వివరించారు. సమావేశంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ పాల్గొన్నారు.

## మర్కుర్ మండలంలో పులి సంచారం

**భయాందోళనలో రైతులు**

మర్కుక్, జనవరి 17 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పులి సంచరిస్తుందన్న అనుమానంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కాశిరెడ్డిపల్లి, శివారువెంకటాపూర్, మంగళవారం దామరకుంటలో పులి సంచరిస్తుందని రైతులు అపోహతో ఇబ్బంది పడుతున్నారు. దామరకుంట గ్రామానికి చెందిన పైతరి నర్సింలుముదిరాజ్ అనే రైతు కుమారుడు అజయ్‌కుమార్ రోజు మాదిరిగానే ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు రాగా వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు వద్ద పులి వచ్చి నీరు తాగుతుండగా గమనించి వీడియో తీసినట్లు తెలిపారు. ఈవిషయమై స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్యలకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా అటవీ శాఖ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పులా లేక మరో అడవి జంతువా అని తెలుసుకునేందుకు రైతు కుమారుడు తీసిన వీడియో విజువల్‌ను ల్యాబ్‌కు పంపిస్తామని రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



దామరకుంటలో పులి సంచరించిన స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

## పకడ్బంధీగా కంటి వెలుగును అమలు చేయాలి

**అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్, జనవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు సంబంధించి అధికారులతోపాటు ప్రభుత్వ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు. ఈ నెల 18న ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొంతాన్‌పల్లి, శివ్వంపేట గ్రామాల్లో ఆమె పర్యటించారు. కంటి వెలుగు కార్యక్రమం చాలా సున్నితమైన కార్యక్రమం అని, దీనిని పకడ్బంధీగా అమలు చేస్తున్న విషయాన్ని ప్రతిమసింగ్ గుర్తు చేశారు. క్యాంపుల నిర్వహణ సమయంలో పరీక్షల కోసం వచ్చే ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. సకాలంలో కంటివెలుగు క్యాంపులు ప్రారంభించేలా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. క్యాంపులను తహశీల్దార్లతో పాటు ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారంతో పాటు రేషన్ షాప్‌లు, బస్టాండ్ల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు షెడ్యూల్‌లోని వివరాలు తెలియజేస్తూ కంటి వెలుగుపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ డిఎంహెచ్‌వో విజయనిర్మల, ఎంపీడీవో కాసం నవీన్ కుమార్, స్థానిక వైద్యాధికారిణి సాయిసౌమ్య, సర్పంచులు గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్, పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

**-మెదక్ డీఎస్పీ సైదులు**

**పెద్దశంకరంపేట, జనవరి 17 ప్రభాతవార్త:**

జాతీయ రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని మెదక్ డీఎస్పీ సైదులు, నేషనల్ హైవే అధికారి మధుసూదన్‌లు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలం కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా డ్రైవర్లకు, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు, కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిత్యం భారీ సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇందులో యువత ఎక్కువగా ప్రాణాలు పొగొట్టుకుంటున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించకపోవడం, పరిమితికి మించి ప్రయాణించడం, అధిక వేగంతో వెళ్లడం వల్ల ప్రమాదాల బారిన పడి వారి కుటుంబాలకు మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. పోలీసుల ఎన్ని ఫైన్లు వేసిన ప్రజల సేఫ్టీ గురించేనన్నారు. ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ పేట ప్రాజెక్ట్ హెడ్ వసుంధర, ప్రాజెక్టు ఇంజనీర్ విజయ్ రాజు, ఇన్సిడెంట్ మేనేజర్ మోయినోద్దైన్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట సమీకృత మార్కెట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట సమీకృత మార్కెట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జిల్లా కేంద్రంలో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రజలకు అద్భుతమైన సేవలందించడమేకాకుండా దేశంలోని వివిధప్రాంతాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల మన్నలను పొందింది అమెరికా తరహాలో అన్ని ఒకే ప్రాంగణంలో లభించే రీతిలో మంత్రి హరీష్‌రావు సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. పరిశుభ్రత, వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం జాతీయ స్థాయి ప్రమాణాలు గల మార్కెట్‌గా గుర్తింపు సాధించింది. ఎప్పుడు పరిశుభ్రంగా, అహ్లాదంగా కనబడేలా నిర్వహించడంతో ఎఫ్‌ఎస్‌ఎస్ఐ ధ్రువీకరణ లభించింది. ఇటీవల ఎఫ్‌ఎస్‌ఎస్ఐ ప్రతినిధుల బృందం సిద్దిపేట సమీకృత మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ దేశంలోనే ఎంతో అదర్శంగా ఉందని కితాబు ఇచ్చారు. మార్కెట్‌లో పాటిస్తున్న పరిశుభ్రతను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌లో పరిశుభ్రమైన, నాణ్యమైన కూరగాయాలు, మాంసం లభిస్తుంది. దేశంలోనే తెలుగు రాష్ట్రాలలో రెండో గుర్తింపు పొందిన మార్కెట్ సిద్దిపేట సమీకృత మార్కెట్ మోడల్‌గా నిలిచింది.




సిద్దిపేట సమీకృత మార్కెట్ యార్డు

**స్వచ్ఛమైన కూరగాయలు అందించడమే లక్ష్యం**

**మంత్రి హరీష్‌రావు**

స్వచ్ఛత, పరిశుభ్రత, నాణ్యత నిర్వహణతోనే గుర్తింపు లభించిందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. కూరగాయలు, మాంసం, పండ్లు, పూల అమ్మకాలతో పాటు మార్కెట్‌లో స్వచ్ఛత, పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలు పాటించడం వలనే గుర్తింపు లభించిందన్నారు. ప్రజల సంపూర్ణ అరోగ్యమే నిజమైన అభివృద్ధి అన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినందులకు మార్కెట్ కమిటీ పాలక వర్గం అధికారులు, సిబ్బందిని అయన అభినందించారు.

**జాతీయ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది**

**మార్కెట్ కమిటీ చైర్మన్ విజితవేణుగోపాల్‌రెడ్డి**

దేశంలో రెండో ఎఫ్‌ఎస్‌ఎస్ఐ ధ్రువీకరణ పొందిన మార్కెట్‌గా సిద్దిపేట సమీకృత మార్కెట్‌కు గుర్తింపు రావడం సంతోషంగా ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంత్రి హరీష్‌రావు భవిష్యత్ ముందు చూపుతో చేసిన అభివృద్ధికి గొప్ప నిదర్శనమన్నారు. పాలక మండలి, సిద్దిపేట ప్రజల పక్షాన మంత్రి హరీష్‌రావుకు అమె కృతజ్ఞతలు తెలిపారు.

## యథేచ్ఛగా అనుమతిలేని నిర్మాణాలు

**నిద్రావస్థలో అధికారులు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త:**

సంగారెడ్డి నియోకవర్గంలోని కంది గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో, అక్రమనిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ నిభంధనలు ఆటకెక్కాయని స్థానికులు ఆరోపస్తున్నారు. బాద్యతగల అధికారులు తమ భాద్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో అనుమతిలేని నిర్మాణాలు యదవిధిగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు పలువురు అనుమతిలేని నిర్మాణాలపై సంబందిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. సంబందింత అధికారులు అవినితి, నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ అదాయనికి గండి పడటంతో పాటు, ప్రభుత్వ నిభంధనలు నవ్వులపాలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కంది గ్రామపంచాయతీ సంగారెడ్డి మున్సిపాలిటికి అనుకొని ఉండటంతో పాటు, చాల విస్తీర్ణం జాతీయ రహదారికి ఇరువైపుల ఉండటంతో వాణిజ్య పరంగా చాల డిమాండ్ ఉంటుందని, కాని నిభంధనలు ఆమలు చేయడంలో సంబందిత అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించుతుండటంతో అనుమతిలేని నిర్మాణాలు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. నిభంధనలు ఆమలు గురించి, చెప్పె ఉన్నాతాదికారులు ఇక్కడ నిభంధనల ఉల్లంఘున, బహిరంగా రహస్యమైనా పట్టించుకనే వారులేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదరిపై అనుమతిలేని నిర్మాణాలు జరగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటిని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంమై కంది పంచాయతీ కార్యాదర్శి విధ్యధర్‌గౌడ్‌ను వివరణ కోరగా జాతీయరహదారి పక్కన అనుమతిలేని నిర్మాణంకు సంబందించిన ఫైల్‌నుఇంతవరకు చూడలేదన్నారు. కంటివెలుగు కార్యక్రమం అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని సమదానమిచ్చారు. డిఎల్పీఒసతీష్‌రెడ్డిని వివరణ కోరగా అనుమతిలేని నిర్మాణాల విషయం తమదృష్టికి రాలేదని, విషయం తెలుసుకొని చర్యలు తీసుకుంటామని అన్నారు.

## దళితబంధు పథకానికి నిధులు కేటాయించాలి

**-సిపిఐ నాయకులు గడిపె మల్లేష్**



సమావేశంలో మాట్లాడుతున్న గడిపె మల్లేష్

**హుస్నాబాద్, జనవరి 17, ప్రభాతవార్త :** దళితబంధు పథకానికి వెంటనే నిధులు కేటాయించి ఎంపికైన అబ్ధిదారులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ నాయకులు గడిపె మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ నేపధ్యంలో పోతారం(ఎస్)గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా హుస్నాబాద్ సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన ప్రాంతమని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ ప్రత్యేకంగా చొరవ చూపుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధుల విడుదలకు ప్రత్నహించాలని మల్లేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్‌సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, గ్రామవార్డుసభ్యులు చెంచెల ఎల్లయ్య, మట్టేల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు సాగును పరిశీలించిన సిడిసి బృందం

**నాలుగు రాష్ట్రాలలో పర్యటిస్తున్న బృందం**



చెరుకు సాగుకు గురించి తెలుసుకుంటున్న రైతులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త:** సంగారెడ్డి గణపతి షుగర్స్ సిడిసి బృందం రైతులు మంగళవారం నుండి 24వ తేదీ వరకు కర్ణాటక తమిళనాడు ఆంధ్రప్రదేశ్ పాండిచ్చేరి రాష్ట్రాలలో పర్యటిస్తూ మంగళవారం వనపర్తి జిల్లా రామకృష్ణుడు కొత్తకోట ఎన్ఎస్ఎల్ కృష్ణవేణి షుగర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీని సందర్శించిన సిడిసి బృందం అక్కడి ఫ్యాక్టరీని సందర్శించిన సిడిసి బృందం అక్కడి ఫ్యాక్టరీలో ఒక్క రోజుకు 3500 టన్నుల చెరుకును క్రాసింగ్ చేసే విధానాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి తెలుసుకున్నారు. రైతులకు హార్వెసింగ్ లేబర్ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం అందించే విధానాన్ని గురించి తెలుసుకున్నారు. అక్కడి ఫ్యాక్టరీ పరిధిలో చెరుకును సాగు చేసే రైతుల చెరుకు పంటను సందర్శించి వారు సాగు చేసే విధానాన్ని, వారు పండించే సీడ్‌ను అక్కడి రైతుల ద్వారా తెలుసుకున్నారు. అక్కడి నుండి కర్ణాటకలోని చాముండేశ్వరి షుగర్స్ లిమిటెడ్ భారతీ నగర్ దొడ్డి మండ్యకు బయలుదేరారు. ఈ పర్యటనలో సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి సిడిసి డైరెక్టర్ జైపాల్ నాయక్ ఫిల్లమెన్మాణిక్ రెడ్డి, రైతు సంఘం నాయకులు, రైతులు శంకర్ గౌడ్, అనంతరావు, కులకర్ణి, ప్రభు శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతరెడ్డి, వెంకట్ నరసింహారెడ్డి, మొగులయ్య వీరప్ప, శంకర్ కుమార్ శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శశికాంత్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## సమస్యల సాధన కోసం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

**సిద్దిపేట రూరల్, జనవరి 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటి అర్టిజెన్స్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులకు 2022 ఏప్రిల్ నుంచి రెండో పిఆర్‌సిని అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి యేడాది గడుస్తున్న పట్టించుకోవడం లేదని యుఈఈయు రాష్ట్ర కంపెనీ అధ్యక్షులు ఎస్.చంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.గోపాలస్వామిలు అన్నారు. టి.స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఈ అఫీస్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నలుగురితో చేయాల్సిన పని ఇద్దరితో చేయిస్తూ ఒత్తిడి పెంచుతున్నారన్నారు. రూ.12,500 వేతనంలో కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కార్మికులకు పిఆర్‌సిని అమలుచేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో అందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యుఈఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటం మధు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదకర్, జిల్లా నాయకులు అర్.అశోక్, గౌటే భాస్కర్, రవి, యాదగిరి, సుధాకర్, భూపాల్‌రెడ్డి, కరుణాకర్, నారాయణరెడ్డి, కనకరాజు, సుమన్, హరీష్, శ్రీనివాస్, రాజు, రమేష్, శ్రావణ్, నాగరాజు ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్లపై చైనా మాంజాతో పాదచారుల ఇక్కట్లు!

ఖైరతాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: ఎక్కడ చూసినా రోడ్లపై పాదచారులు నడవలేనివిధంగా చైనా మాంజాలు పలు ఇబ్బందులు కలిగిస్తున్నాయని కొందరు పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా ఉపయోగించిన మాంజాలు ఎక్కడపడితే అక్కడ పడి వేయడంతో కాళ్లచెప్పులకు తట్టుకుంటూ నడవడానికి వీలులేకుండా చేస్తున్నాయని ఇంకొందరు మహిళలు వాపోతున్నారు. అధికశాతం చైనా మాంజాలే కనబడుతున్నాయని, ఇవి కాళ్లకు తట్టుకోవడంతో తీయలేని పరిస్థితి నెలకొంటుందంటున్నారు.

## మౌలిక వసతులు కల్పనే లక్ష్యం

**ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



కాలనీ వాసులతో ఎమ్మెల్యే

అల్వాల్, జనవరి 17 ప్రభాతవార్త: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం తన ధ్యేయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. మంగళవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని దినకర్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వసతులను కల్పించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. అభివృద్ధిని ప్రణాళికాబద్దంగా ముందుకు తీసుకుని వెళుతున్నామని మైనంపల్లి వివరించారు. దీర్ఘకాలికంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించగలిగామని తెలిపారు. ప్రజలు సహకారంతో మరింత అభివృద్ధిని సాధిస్తామని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజు డిఇఇ కార్తీక్ ఎఇ అరుణ్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్ సూర్యకిరణ్ నర్సింహ ఇతరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి : కొంతం దీపిక



మోండాలోని శివాజీ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట, జనవరి 17 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి, జలమండలి వంటి వివిధ విభాగాల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టిపెట్టాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. మంగళవారం ఆమె శివాజీ నగర్ దొక్కలమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రవిందర్, జలమండలి ఏఈ సంధ్య, సిబ్బంది అనీల్, శాంతి కుమార్, నాగరాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో ఘనంగా ఒడియ వేడుకలు : రష్మి రంజన్

కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఒడియ పీపుల్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 7వ వార్డు జయలక్ష్మి గార్డెన్‌లో బంధు మిలన్‌వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఒడియ కమ్యూనిటీకి చెందిన పలువురు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒడియ పీపుల్స్‌వెల్ఫేర్ అధ్యక్షుడు రష్మిరంజన్ మహాపాత్ర నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జనవరి 17 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా సూరారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌జికె 11/కెవి ఫీడర్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప సముదాయం అంతటా ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 2గంల వరకు, సూరారం 11/కెవి ఫీడర్ పరిధిలోని సూరారం గ్రామం అంతటా మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## చిలుకలగూడ చింతబావి బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ రాసూరి సునిత



స్థానికులతో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాసూరి సునిత

మెట్టుగూడ, జనవరి 17 ప్రభాతవార్త: చిలుకలగూడ చింతబావి బస్తీలో సమస్యల తెలుసుకునేందుకు మంగళవారం నాయకులతో కలిసి కార్పొరేటర్ రాసూరి సునిత పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ పైపులైన్ సమస్య, రోడ్ల సమస్య, వీది దీపాలు వెలగడంలేదని ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొని రావాలని స్థానికులను ఆమె సూచించారు.

### అభివృద్ధికి అర్థం తెలియని బిఆర్ఎస్ నాయకులు కూడా తమ స్థాయిని మరచి మాట్లాడడం సిగ్గుచేటు

చిక్కడపల్లి, జనవరి 17 ప్రభాతవార్త: అభివృద్ధికి అర్థం తెలియని బిఆర్ఎస్ నాయకులు కూడా తమ స్థాయిని మరచి మాట్లాడడం సిగ్గుచేటని గాంధీనగర్ డివిజన్ బిజెపి నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. నిజంగా డివిజన్ అభివృద్ధికి కృషి చేసి ఉంటే గడచిన 10 సంవత్సరాలలో కార్పొరేటర్‌గా ఉన్న ముఠాపద్మా నరేశ్, మూడున్నర సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ డివిజన్‌ను ఏ విధంగా అభివృద్ధి చేశారో, ఏమి వెలగబెట్టారో ప్రజల ముందు ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని మంగళవారం గాంధీనగర్‌లోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.

## రోహిత్ వేముల త్యాగం వృధా కాదు

**వడ్లమూరి కృష్ణస్వరూప్**



ప్రదర్శన చేస్తున్న డిబిపి కార్యకర్తలు

సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: డా.బి.ఆర్.అంబేద్కర్ పోరాట వారసుడు, దళిత బహుజన ఉద్యమ ధ్రువతార హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి రిసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణ స్వరూప్ కొనియాడారు. మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద రోహిత్ వేముల 8వ వర్ధంతి సమావేశంలో ఆయన ప్రసంగించారు. తొలుత రోహిత్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆనేక మంది కార్యకర్తలు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వడ్లమూరి మాట్లాడుతూ విశ్వవి ద్యాలయాల్లో అంబేద్కర్ ఆలోచనా విధానం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోరకు ప్రజాతంత్ర, లౌకిక, సోషలిస్టు ప్రజాస్వామిక వాతావరణ కాపాడుకోవడం కోసం ప్రదానంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో పేరుకుపోయిన కుల దురహంకారం, వివక్షత, అణిచివేత, హిందూ కాషాయ మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున గళం విప్పి పోరాటం చేయడమే కాకుండా శాస్త్రీయ విద్య కోసం దళిత బహుజన విద్యార్థుల రాజ్యాంగ హక్కుల అమలు కోసం రోహిత్ వేముల పోరాటం చేసినందుకే సిఎం కెసిఆర్, పిఎం నరేంద్రమోదీ ప్రభుత్వాలు తీవ్రంగా అణిచివేశా యని ఆరోపించారు. ఈ ప్రదర్శనలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక చిప్పరి సుబ్బారావు, డిబిఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్‌రావు, పార్టీ నాయకులు అర్షలరాజు, గుంటి పండు, సి.హెచ్. కరుణాకర్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో టీటిడి కల్యాణ మండపం ఏర్పాటు చేయాలి : జంపప్రతాప్



బోయిన్‌పల్లిలో టీటిడి కల్యాణ మండపం నిర్మించాలని ఏపి సిఎం జగన్‌మోహన్ రెడ్డికి లేఖ పంపిన జంపనప్రతాప్

కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ఎస్సీ నియోజకవర్గంలో టీటిడి ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ఏపి ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, టీటిడి ఈఓ ధర్మారెడ్డి, చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిలకు లేఖను పంపినట్లు తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్ట్‌లోని బంగ్లానెం 170లో 7.5 ఎకరాల స్థలంలో టీటిడి వేదాంతవర్ధిని కళాశాల కొనసాగుతుందన్నారు. అందులో ఖాళీగా ఉన్న 3 ఎకరాల స్థలంలో టీటిడి కళ్యాణ మండపం నిర్మించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# వెనుక బడిన వర్గాల యువతీ, యువకులకు చేయూత

బేగంపేట జనవరి 17,ప్రభాతవార్త : వెనుక బడిన వర్గాలకు చెందిన యువతీ,యువకులకు స్వయం శక్తిగా ఎదిగేందుకు,వారికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు భారతీయయువశక్తి ట్రస్ట్ పనిచేస్తుందని ట్రస్ట్ ఛైర్మన్ లక్ష్మి అన్నారు.మంగళవారం భారతీయ యువశక్తి ట్రస్ట్ త్రైమాసిక సదస్సు సికింద్రాబాద్ పార్క్‌లేన్ హోటల్‌లో జరిగింది.భారతీయ యువశక్తి ట్రస్ట్ (బివైఎస్‌టి) ఒక లాభాపేక్ష లేని సంస్థ,ప్రధానంగా భారతదేశంలో వెనుక బడిన యువతీ,యువకులకు వ్యాపార ఆలోచనలను మార్గ నిర్దేశం చేయడంతో పాటు తమ మద్దతుతో ఆచరణీయ సంస్థలుగా అభివృద్ధి చేయడంలో సహాయపడుతుందన్నారు.1992లో స్థాపించబడి 30సంవత్సరాలుగా దేశంలోని యువతకు తమ వ్యాపార ఆలోచనలను లాభదాయక సంస్థలుగా మార్చడానికి ఒక వేదికగా పనిచేస్తుందన్నారు.యువత శక్తిని ఆర్థికాభివృద్ధి వైపు మళ్లించే లక్ష్యంతో బివైఎస్‌టి పనిచేస్తుందన్నారు.దేశ వ్యాప్తంగా 18 ప్రాంతాల్లో ఈ సదస్సు జరిగింది.ట్రస్ట్ ఛైర్మన్ లక్ష్మి ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గడచిన 30సంవత్సరాలలో వేలాది మందియువతను నిరుద్యోగ స్థాయి నుంచి విజయవంతమైన వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దామన్నారు.18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన నిరుపేద యువతీ, యువకులకు సలహాలు,సూచనల ద్వారా మార్గనిర్దేశకం చేసి విజయ వంతమైన సంస్థలను ప్రారంభించడానికి సహాయ పడుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ బ్రాంచ్ సికింద్రాబాద్ ఏజిఎమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ యువట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మద్దతుగా నిలుస్తూ వారికి శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి మంచి వ్యాపార వేత్తలను తయారు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు,చిన్న,మధ్య తరహా వ్యాపార రంగంలో అభివృద్ధి చెందిన వారు పలువురు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ చేస్తే కేంద్రమంత్రులను అడ్డుకుంటాం

**పార్లమెంట్‌లో బిసి బిల్లుపెట్టాలని ఫిబ్రవరి 8,9 తేదీల్లో ఛలోఢిల్లీ.. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



ఛలోఢిల్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య,గుజ్జకృష్ణ, రాజ్‌కుమార్

హైదరాబాద్, జనవరి 17,ప్రభాతవార్త: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే కేంద్రమంత్రులను అడ్డుకుంటామని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.అసెంబ్లీ, పార్లమెంట్‌లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఫిబ్రవరి 8.9 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరుపుతామన్నారు. ఈమేరకు మంగళవారం కాచిగూడలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, యువజన సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఛలోఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టి బిసిలకు 50శాతం రిజర్వేషన్లు పెట్టాలని అలాగే బిసిల ఉద్యోగ రిజర్వేషన్లను 25శాతం నుంచి 50శాతానికి పెంచాలన్నారు. అలాగే త్వరలో జరగబోయే జనగణనలో బిసిల కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల అడగకపోయినా అగ్రకులాకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం బిసిల డిమాండ్లకు స్పందించకపోతే శ్రీలంక తరహాలు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి ఉద్యోగుల సంఘం సెక్రటరీ బి.శ్రీనివాస్. మొట్టు చంద్రశేఖర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో మేయర్ సమీక్షా సమావేశం



అధికారులతో చర్చిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

నిజాంపేట్, జనవరి 17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి మంగళవారం ఉన్నతాధికారులతో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం, ఎస్ఎన్‌డీపి పనులు, రోడ్డు అభి వృద్ధి పనులు, డ్రైనేజీ పనులు, వైకుంఠ ధామం, డంపింగ్‌యార్డు, పట్టణ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. అభివృ ద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణారావు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ అధికారులు ఎన్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్ మమతకు వినతి పత్రం అందజేస్తున్న సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, జనవరి17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి మంగళవారం జోనల్ కమిషనర్ మమతకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలో పార్కుల ఏర్పాటుకు కేటాయించిన స్థలాలు కబ్జాకు గురువుతున్నాయని, వాటిని తొలగించి పార్కుల చుట్టూ కాంపౌండ్ గోడలు నిర్మించి పార్కులను కాపాడాలని జోనల్ కమిషనర్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ పార్కు స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ అధ్యక్షుడు జహంగీర్, శ్రీను, బస్తీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం



ఆర్థిక సహాయన్ని అందజేస్తున్న కాశీనాథ్‌యాదవ్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త : 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన ఎం.రమేష్ (32) అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న 124 డివిజన్ వార్డు సభ్యుడు కాశినాథ్‌యాదవ్ మంగళవారం ముందుకు వచ్చి అంత్యక్రియల కోసం 5వేల రూపాయలను తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కాశినాథ్‌యాదవ్ మాట్లాడుతూ ఒక యాదవుడి అంత్యక్రియల కోసం నావంతు సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. కష్టాల్లో ఉన్న యాదవుడు ఎవరైనా సరే నావంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## మల్లికార్జున్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి

**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిక్కడపల్లి, జనవరి 17 ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లా కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై కొందరు బిజెపి, విహెచ్‌పి, భజరంగ్ దళ్ కార్యకర్తలపై చేసిన దౌర్జన్యాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్పీసీ) నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయునిపై పెట్టిన రివర్స్ కేసును ఎత్తివేయాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు బోదించనివ్వాలని మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మల్లికార్జున్‌పై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి, సిపిఎం నేతలు డీజీ నరసింహారావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.డి.చలపతిరావు, వీక్షణం వేణుగోపాల్, ప్రొఫెసర్ కాశీలం, వినయబాబు, టిజేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో వసతులు ఏర్పాటు చేయాలి



స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

తార్నాక, జనవరి 17 ప్రభాతవార్త: లలితాభాగ్‌లో ఉన్న హిందు స్మశాన వాటిక కమిటీ సభ్యులు నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డిని కలిసి స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. స్మశాన వాటికలో రోడ్డు, వాష్‌రూం, దహణ సంస్కారాల మండపం, స్టోర్ రూం వసతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతినిధులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్మశాన వాటికి కమిటీ చైర్మన్ శ్రీనివాస్, అధ్యక్షులు నర్సింగ్‌రావు, చీఫ్ అడ్వైజర్ సత్యనారాయణ, శివకుమార్, అశోక్ తధితరులు పాల్గొన్నారు.

**కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి..** లాలాపేట్ ప్రొ. జయశంకర్ స్టేడియం, నాగార్జునగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు మందులతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

## మురకంజా అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించరాదు

**సిపిఐ నేత ఇ.టి.నర్సింహా డిమాండ్**

సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: మూడు రోజుల క్రితం టర్కిలో మృతి చెందిన 8వ నిజాం ముకరం ఝా అంత్యక్రియలు అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం తెలంగాణ ప్రజలను, సాయుధపోరాటాన్ని అవమానించడమేనని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఇ.టి.నర్సింహా చెప్పారు. కనీస పౌరహక్కులు లేకుండా ఆనాడు నిజాం పాలకులు హైదరాబాద్ రాష్ట్రంలో పరిపాలన చేశారని, ప్రజల నిరంకుశానికి వెట్టి చాకిరి, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా రాచరికాన్ని రద్దు చేయాలని పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోరాటాలపై తీవ్రమైన అణిచివేత కొనసాగించారని, నిజాం పాలకుడు ఆ పోరాటంలో వేలాది మంది ప్రజలు తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై అణిచివేత కొనసాగించి వేలాది రూపాయలు ప్రజల ధనాన్ని దోచుకున్న పాలకుల వారసలకు లాంచనంగా అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ద్విచక్ర వాహనం పైనుంచి పడి మృతి

బేగంపేట జనవరి 17,ప్రభాతవార్త : తన ద్విచక్ర వాహనంపైన ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాద వశాత్తు బారికేడ్లను ఢీకొట్టి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ పాండే ఓల్డ్ బోయిన్ పల్లిలోని మల్లిఖార్జున కాలనీలో నివాస ం ఉంటున్నాడు.5 రోజుల క్రితం అతని భార్య కు మగబిడ్డ జన్మించాడు.15వ తేదీన అతని స్నేహితుడు రాజ బాబును చూసేందుకు వచ్చాడు.అదే రోజు రాత్రి గం 10.30నిలకు రాజ తిరిగి వెళ్లేందుకు బయలు దేరగా రాజ్‌కుమార్ పాండే సోదరుడు మనోజ్ కుమార్ పాండే(29) అతన్ని తన ద్విచక్ర వాహనం పై దించి వచ్చేందుకు వెళ్లాడు.వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి బాలంరాయి సమీపంలోని స్కోడా షోరూం వద్ద బారికేడ్లను ఢీకొంది.ఈ ప్రమాదంలో కిందపడిపోయిన మనోజ్ కుమార్ పాండే(29) కు తీవ్ర గాయాలయ్యాయి.దీంతో అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు.ఈ మేరకు సబ్‌ఇన్స్‌పెక్టర్ ఆర్.జయచంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎదగాలి

**విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**





సమావేశంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి, కార్పొరేటర్ సంగీతాయాదవ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 17,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎదగాలని అందుకు తెలంగాణ ప్రభుత్వం తగిన శిక్షణ ఇస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో మహిళలకు విద్యా, ఆర్థికంగా అనేక సంక్షేమ పథకాలు కల్పిస్తూ ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈమేరకు మంగళవారం మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికల చదువు కోసం 1907 మంది విద్యార్థినీలకు ఒక్కో విద్యార్థికి 8నుంచి 10వేలు చొప్పున ఒకకోటి ఆరవై లక్షలు స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. గతంలో బాలిక చదువు పట్ల తల్లిదండ్రులు విముఖత చూపేవారని.. కానీ నేటి సమాజంలో బాలురుతో సమానంగా బాలికలు రాణిస్తున్నారన్నారు. స్కాలర్‌షిప్‌పొందిన ప్రతి విద్యార్థి దానికి వినియోగించుకుని ఉన్నత చదువులు పూర్తి చేసి తోటివారికి సహాయం చేసేవిధంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం అహార్నిశలు కృషి



రహమతాబాద్ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న హబీబ్ ఫాతిమానగర్ ఫేస్ 2కు చెందిన బిఆర్ఎస్ నాయకులు

యూసుఫ్ గూడ, జనవరి 17, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని ప్రజలందరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రజా సంక్షేమం కోసం అహార్నిశలు కృషిచేస్తున్న స్థానిక శాసన సభ్యులు గ్రేటర్ హైదరాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మాగంటిగోపినాథ్‌కు మంత్రి పదవిలో అవకాశం కల్పించాలంటూ రహమత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమా నగర్ ఫేస్ 2 బిఆర్ఎస్ అధ్యక్షులు అబ్దుల్ గని ఆధ్వర్యంలో రహమతాబాద్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. తొందరలో జరిగే మంత్రి వర్గం విస్తరణలో స్థానం కల్పించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రఫీభాయ్, రవూఫ్, ఇస్మాయేల్, కరీమ్, అంజద్, జబ్బర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఒయూ పిఎస్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తార్నాక, జనవరి 17 ప్రభాతవార్త: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజేంద్రన్ కథనం ప్రకారం. మాణికేశ్వరీనగర్ బస్తీ కమాన్ సమీపంలో ఉన్న చెత్తకుప్ప వద్ద సుమారు (34) వయసు గల వ్యక్తి కింద పడి ఉన్నాడని స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి చూడగా అతను అప్పటికే మృతి చెంది కనిపించాడు. దీంతో పోలీసులు అతని మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆచూకి తెలిసిన వారు ఓ.యూ పిఎస్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పంజాగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం పెట్టాల్సిందే

**పలు రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల తీర్మాణం**

హైదరాబాద్, జనవరి 17,ప్రభాతవార్త: పంజాగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టాల్సిందేనని పలు రాజకీయ,ప్రజా, దళిత సంఘాలు తీర్మాణం చేశాయి. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దళిత సంఘాల జేఏసీ చైర్మన్ ఎస్.రాజు వస్తాద్ అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. దీనికి ప్రజాగాయకుడు గద్దర్, కాంగ్రె స్ నేతలు విహెచ్. మల్లురవి, సంపత్, రాములు నాయక్ లతో పలు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈసం దర్భంగా గద్దర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల ఆరు నెలల కుపైగా అంబేడ్కర్ విగ్రహం విగ్రహం నెలకొల్పాలని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమ న్నారు. ఇప్పటికైనా జైబీమ్ కార్యకర్తల పోరాటానికి గౌరవమిచ్చి వెంటనే అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. వి.హనుమం తరావు మాట్లాడుతూ కోర్టు తీర్పు మేరకు ప్రభుత్వం విగ్రహ ఏర్పాటుకు సన్నదం కావాలని అందుకు సిఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.



మల్లిఖార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

## హుండీ ఆదాయంతో ఆలయం అభివృద్ధి చేస్తాం

**-పొట్లపల్లి గ్రామ సర్పంచ్ దేవసాని సుశీల**

**హుస్నాబాద్, జనవరి 17, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ సహకారంతోపాటు ఆలయంలో భక్తుల కానుకలు వస్తున్న హుండీ ఆదాయంతో ఆలయ అభివృద్ధి చేస్తామని పొట్లపల్లి గ్రామ సర్పంచ్ దేవసాని సుశీల పేర్కొన్నారు. మంగళవారం మల్లిఖార్జున దేవాలయంలో హుండీ ఆదాయాన్ని సుశీల సమక్షంలో ఆలయ కమిటీ లెక్కించారు. మల్లన్న అగ్నిగుండాలకు సంబంధించిన ఆదాయం 18వేల300రూపాయలు రాగా మల్లన్న పట్నాలకు, కొబ్బరికాయలకు, అర్చన టికెట్లకు సంబంధించి 31వేయి700రూపాయల ఆదాయం ఆలయానికి హుండీ ద్వార చేరినట్లు ఆహ్వానించతగ్గదని సర్పంచ్ సుశీల సంతోషం వ్యక్తం చేశారు. ఇట్టి ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కోసమే వెచ్చించనున్నట్లు సర్పంచ్ దేవసాని సుశీల పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముఖ్యులు మార్క అనిల్‌కుమార్‌గౌడ్, పాకాల శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణ



పులి కృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బెజ్జంకి, జనవరి 17, ప్రభాతవార్త:** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన పులి కృష్ణను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పులి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను, కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తామన్నారు. తనపై నమ్మకంతో యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, నాయకులు పొన్నం ప్రభాకర్, కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి తదితరులు పులి కృష్ణను శాలువాతో సత్కరించారు.

## దుబ్బాక పట్టణాభివృద్ధే లక్ష్యం

**పట్టణ చైర్ పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్

**దుబ్బాక, జనవరి 17, ప్రభాతవార్త:** దుబ్బాక పట్టణాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషిచేస్తున్నట్లు, దుబ్బాక పట్టణాన్ని జిల్లాలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పట్టణ చైర్ పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డిలు అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో 12వ వార్డులో నూతనంగా ప్రారంభమైన సిసి రోడ్ల పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో నాలుగున్నర కోట్లతో పలు వార్డుల్లో మురికి కాలువలు నిర్మిస్తున్నట్లు, దాంతో పాటుగా ప్రస్తుతం ఆరున్నర కోట్లతో వివిధ వార్డుల్లో సిసి రోడ్డు పనులు ప్రారంభించి నట్లు తెలిపారు. సిసి రోడ్ల పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని, నాణ్యత లేకుండా పనులు చేపడితే చర్యలు తప్పవని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏఈ పృథ్వీరాజ్, సిబ్బంది ప్రవీణ్, దిలీప్, బారాసా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించిన గడా అధికారి

**జగదేవ్‌పూర్, జనవరి 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఈనెల 19న నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను, వసతులను మంగళవారం గజ్వేల్ ఏరియా డెవలప్మెంట్ ఆఫీసర్ ముత్యంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయరాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి కంటి సమస్యలు ఉన్నా ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాల ద్వారా సేవలు పొందాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో నిర్వహణ కేంద్రాల వద్ద ప్రజలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌గుప్త, జగదేవ్‌పూర్ పిహెచ్‌సి వైద్యాధికారి సత్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సత్యం, పిహెచ్‌సి సిబ్బంది జితేందర్‌రెడ్డి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మన ఊరు-మన బడి పనులు వేగవంతం కావాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 17, ప్రభాతవార్త:** జిల్లాలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు అన్ని హంగులతో తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కలిసి మన ఊరు-మన బడి పనుల పురోగతి, ఎఫ్‌టిఓల జనరేట్, మోడల్ స్కూల్స్ పురోగతి తదితర అంశాలపై విద్య, ఇంజనీర్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు పూర్తయిన పాఠశాలలకు పెయింటింగ్ పూర్తి కావాలన్నారు. ఆయా పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన ఉండేలా చొరవ చూపాలని సంబంధిత ఎంఈఓలకు సూచించారు. మన ఊరు-మన బడిలో చేపట్టిన మోడల్ స్కూల్స్ ప్రారంభించడానికి అన్ని హంగులతో సిద్ధం చేయాలని ఆదేశించారు. మన ఊరు-మన బడిలో చేపట్టిన పాఠశాలల పెయింటింగ్ విషయంలో ప్రభుత్వం సూచించినిన కలర్ కోడ్ రంగులు వేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా వైద్యాధికారి రాజేష్, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, డిఈలు, ఎంఈఓలు, విద్యాశాఖ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ చేయూత

**గజ్వేల్, జనవరి 17 (ప్రభాతవార్త):** ఇంటి యజమానిని కోల్పోయి దీన స్థితిలో ఉన్న కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ చేయూతగా నిలిచింది. రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన పంగ యాదగిరి మరణించడంతో అతని భార్య శ్యామల ఇద్దరు పిల్లలు దివ్య, భానులతో కలిసి గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటుంది. అక్కడ ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.3,500 విలువైన నిత్యావసర సరుకులు, రూ.6,500 నగదును అందజేశారు. దయనీయ స్థితిలో ఉన్న ఈ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రం తులసిదాస్, కోశాధికారి దొంతుల ఆనంద్, సభ్యులు టెంట్ నర్సింలు, పెద్దూరి శ్రీనివాస్, యాట ఆంజనేయులు, ఎక్కలదేవి కనకరాజు, భువనగిరి రవీందర్, మంగళంపల్లి సత్యనారాయణ, తూం దేవేందర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్, పూలేల ఆశయ సాధనకు కృషి చేయాలి

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 17, ప్రభాతవార్త:** అంబేద్కర్ పూలే వంటి మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రాజ్యాంగ రక్షణ అనేది ప్రలజందరి బాధ్యత అని సంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కులవివక్షణ వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)-2023 మహనీయుల క్యాలెండర్‌ను సంగారెడ్డి లోని జిల్లా పరిషత్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల ఆశయాలు, లక్ష్యాలు ప్రతిభింబించే విధంగా మహనీయులు ఫోటోలు, నినాదాలతో కెవిపిఎస్ క్యాలెండర్ తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, న్యాయవాది అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు రామారావు, సీనియర్ దళిత ఉద్యమ నేత నాగన్న, మల్లయ్య, లక్ష్మయ్య, డాకూర్ మల్లేష్, విద్యాసాగర్, నాగరాజు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి రామచందర్, రాజు, మహేష్, కోటారి నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు దాస్, శ్రీహరి, గంగారాం, వివిధ సంఘాల నాయకులు సంతోష్, బస్వరాజ్, పవన్, యువ న్యాయవాది సుదర్శన్, సంచుల ప్రవీణ్, సదానంద, లక్ష్మణ్, మల్లేష్, శ్రీనివాస్, ప్రభాకర్, వివిధ సంఘాల నాయకలు, కెవిపిఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కెవిపిఎస్ నాయకులు

# 'కంటి వెలుగు' సజావుగా జరగాలి

**ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి**
**అన్ని కేంద్రాలలో వసతులు ఉండాలి**
**అన్ని ఏర్పాట్లతో సన్నద్ధంగా ఉండాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 17, ప్రభాతవార్త:** జిల్లాలో ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరి సమిష్టి కృషితో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై జిల్లా మండల స్థాయి అధికారులు, మండల, నియోజకవర్గ వర్గ ప్రత్యేక అధికారులు, పంచాయతీరాజ్, పోలీస్, వైద్యాధికారులకు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి దిశ నిర్దేశంచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సున్నిత కార్యక్రమమని, దీనిని పకడ్బందీగా చేయాల్సి న ఆవశ్యకత ఉందన్నారు. ఆయా అధికారులు అన్ని ఏర్పాట్లతో సన్నద్ధం కావాలని సూచించారు. 19న ఉదయం 9 గంటలకు కచ్చితంగా కంటి వెలుగు క్యాంపు ప్రారంభం కావాలన్నారు. జిల్లాలో 69 టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, మరో 3 బఫర్ టీములను అందుబాటులో ఉంచామని తెలిపారు. 854 వెన్యులలో 17,11,680 మందికి స్క్రీనింగ్ చేస్తారన్నారు. 18 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎవరికి కంటిచూపు సమస్య రాకుండా లేకుండా నివారణ చేయడమే కంటి వెలుగు ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. పిహెచ్సీ వారీగా టీమ్లను ఏర్పాటు చేశామని, మైక్రో ప్లాన్ షెడ్యూల్ తయారు చేయడం జరిగిందని, టీమ్ వారీగా ప్రొసీడింగ్స్ ఇచ్చామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 64 వేల రీడింగ్ కళ్లద్దాలు అందుబాటులో ఉన్నాయనిన, రీడింగ్ గ్లాసులు అవసరమైన వారికి స్క్రీనింగ్ అయిన వెంటనే ఇచ్చి పంపాలని సూచించారు. ప్రతి క్యాంప్‌ను ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో రోజుకు 300 మంది, పట్టణాల్లో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా పక్క ప్రణాళికతో చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రత్యేక అధికారులను ముందుగా తనిఖీ చేసి నివేదికలు అందజేయాలన్నారు. కంటి వెలుగు కంట్రోల్ రూమ్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఏవేని ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 9494851165 కు ఫోన్‌చేసి తెలియజేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ ప్రోగ్రామ్స్ షెడ్యూల్ ఎస్‌హెచ్ఓలకు ఇవ్వాలని, అదే విధంగా ఎస్‌హెచ్‌వోలు రెగ్యూలర్‌గా ప్రోగ్రాం చెక్ చేయాలని ఏవేని లోటుపాట్లు ఉంటే తెలియజేయాలన్నారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి క్యాంపు వద్ద భద్రత ఏర్పాట్లు పటిష్టంగా ఉండేల చర్యలు చేపట్టాలని సూచించారు. కంటి స్క్రీనింగ్ కోసం ప్రజలు ఒకేసారి రాకుండా వారికి ఇచ్చిన టైం మేరకు వచ్చేలా పంచాయతీ సెక్రెటరీ, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీలు చూసుకోవాలని కోరారు. అందరి కో-ఆర్డినేషన్తో జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాజర్షి షా, డిపిఓడి, డిఆర్‌డిఓ, డిఎంఅండ్ హెచ్ఓ, జెడ్పీ సీఈవో, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, అదనపు పీడీలు, ఏపీఎంలు, మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి షటిల్ టోర్నీ విజేత ఏబిఏ

**ఆమనగల్లు, జనవరి17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ విజేతగా ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిలిచింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, పవన్‌ల జోడి ఫైనల్‌లో మంచి ప్రదర్శన చేసి టోర్నీ విజేతగా నిలిచారు. టోర్నీ ఆద్యాంతం మంచి ఆట తీరుతో ఫైనల్ చేరి న ప్రసాద్, పవన్‌ల జోడి ఫైనల్‌లో కూడా సత్తా చాటి గెలుపొందారు. కాగా విజేతగా నిలిచిన ఏబిఏ క్రీడాకారులు ఎంగలి ప్రసాద్, పవన్‌లను తలకొండపల్లి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ బహు మతులు అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లా స్థాయి టోర్నిలో విజయం సాధించిన ఏబిఏ క్రీడాకారులను మండల క్రీడాకారులు అభినందించారు.

## వెంకమ్మగూడలో..గ్రామదేవతల ఆలయాలు పునరుద్ధరణ

**నందిగామ జనవరి17, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామంలో దాతల సహకారంతో, గ్రామస్థుల ప్రోత్సాహంతో గ్రామదేవతల ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ బుయ్యని రజనీత వీరేందర్ గౌడ్ స్పష్టం చేశారు. గ్రామంలో పురాతన కాలం నాటి దేవతా మూర్తుల ఆలయాలు శిథిలావస్థకు చెరుకున్న నేపథ్యంలో నిర్మాణ పనులను చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో కొలిచె వారి భక్తుల కొంగు బంగారమై వెలుగొందు తున్న పోచమ్మ, మైసమ్మ దేవతల ఆలయాల పునరుద్ధరణకు నడుం బిగించినట్లు తెలిపారు. గ్రామదేవతల ఆలయ నిర్మాణ పనులకు గ్రామ స్థులందరూ పూర్తి సహకారం అందించడం పట్ల సర్పంచ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## గురవయ్యను పరామర్శించిన శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి జనవరి17, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన వద్దే గురవయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్య ఇచ్చారు. అనంతరం ఆర్థిక సహాయంగా 3వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కటికల శేఖర్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముక్తల జంగయ్య గౌడ్, రైతు సమన్వయ అధ్యక్షుడు కటికల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ రాములు, బి.శ్యామ్ సుందర్ రెడ్డి, నిధురం యాదయ్య, బి.వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**షాబాద్, జనవరి 17, ప్రభాతవార్త :** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సీతారాంపూర్, మద్దూర్ గ్రామాలకు చెందని 6మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పాండురంగారెడ్డి, ఉపసర్పంచ్ సందీప్, నాయకులు శివప్ప, శివరాజ్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్, రాందేవ్, మహేందర్ ఉన్నారు.

## గట్టుఇప్పలపల్లి గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా దశరథం

**తలకొండపల్లి జనవరి17, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో రజక సంఘం మండల అధ్యక్షుడు కల్వకోల యాదగిరి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రజక సంఘం ఆర్గనైజేషన్ సెక్రటరీ జనలీల శ్రీనివాస్ హాజరై నూతన కమిటీని ఎనుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బంగారు గడ్డ దశరథం, ఉపాధ్యక్షుడిగా పెంద్యాల సాయిలు, ప్రధాన కార్యదర్శిగా బంగారు గడ్డ బిక్షపతి, కోశాధికారి కల్వకోల చెన్నయ్య, ప్రచార కార్యదర్శిగా బంగారు గడ్డ శ్రీను, సలహదారులు బంగారు గడ్డ జంగయ్య, బంగారు గడ్డ చిన్న అంజయ్య, బంగారు గడ్డ వెంకటయ్య, గ్రామ కమిటీ సభ్యులుగా బంగారు గడ్డ పెద్ద జంగయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, ఒట్టికొటి దశరథం, మల్లేష్, పెంద్యాల రాజు, పెంద్యాల లింగం, శివ, అంజయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాయిచెట్టి ఆంజ నేయులు, మాజీ ప్రధాన కార్యదర్శి కందుకూరి కృష్ణ, మండల ప్రచార కార్యదర్శి మహేష్, గట్టుఇప్పలపల్లి మాజీ రజక సంఘం అధ్యక్షుడు బంగారుగడ్డ రాజశేఖర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**తలకొండపల్లి జనవరి17, ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తలకొండపల్లి మండ ల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన ఆయిల్ నర్సమ్మకి ముఖ్య మంత్రి సహాయనిధి నుండి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకా రంతో మంజూరైన 20వేల రూపాయలను చెక్కును బాధితురాలికి శ్రీని వాస్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రైతు సమ న్వయ సమితి అధ్యక్షుడు నరేందర్ గౌడ్, జంగయ్య, మల్లేష్ గౌడ్, బంధులాల్, వెంకటయ్య, రవి, చెన్నకేశవులు, సుల్తాన్, పాల్గొన్నారు.

**చుక్కాపూర్ గ్రామంలో :** మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కంఠం శేఖర్‌కి 60వేల రూపాయలు పబ్బు లావణ్యకి 24వేల రూపాయల మంజూరైన సిఎం సహాయనిధి చెక్కును ఆమనగల్ మా ర్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ కార్య క్రమంలో చుక్కాపూర్ బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ ,ఉపాధ్యక్షుడు మల్లేష్, రైతు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మకొండ మల్ రెడ్డి మాల్ రెడ్డి, వార్డు మెంబర్లు శ్రీను, గండికోట నరసింహ, భీష్మ చారి, నాయకులు శ్రీధర్ రెడ్డి, శ్రావన్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి, పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**తలకొండపల్లి జనవరి 17, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల సర్వసభ సమావేశం బుధవారం నిర్వహిస్తు న్నట్లు ఎంపిడివో శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలన్నారు. సమావేశం మండల పరిషత్ అధ్యక్షు రాలు తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ అధ్యక్షత న నిర్వహిస్తున్నందున మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఉదయం 10 : 30 గంటలకు తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం వరకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

# కెవిపిఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల 7వ వర్ధంతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త:** మనువాదుల మతోన్మాదుల కుట్రలకు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో దళిత రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల వ్యవస్థీకృత హత్యకు గురయ్యాడని మనువాదంపై విశాల ఐక్య పోరాటమే ఆయనకు నివాళిఅని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ అన్నారు. కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిస్) ఆధ్వర్యంలో రోహిత్ వేముల ఏడవ వర్ధంతి సందర్భంగా సుందరయ్య భవన్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహిత్ వేముల హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులను ఉన్నత చదువుల నుండి దూరం చేయడానికి ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం కుట్ర చేసిందని అన్నారు. యూనివర్సిటీలోని దళిత విద్యార్థులకు రావాల్సిన ఫెలోషిప్పులను వైస్ ఛాన్సలర్ నిలిపివేశారని దానిని నిరసిస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టామన్నారు. దళిత విద్యార్థులను వెలివేయంతో క్యాంపస్‌లో వెలివాడను ఏర్పాటు చేసుకొని రోహిత్ వేముల న్యాయం కోసం పోరాడారని దళిత విద్యార్థుల సమస్యలను మాట్లాడకుండా తమ భావాలను వ్యక్తం చేయకుండా గొంతు నొక్కే కుట్ర చేశారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థుల పట్ల వివక్షత పాటిస్తుందని చెప్పారు. రోహిత్ వేముల పోరాట స్ఫూర్తితో మనువాదం, మతోన్మాదంపై బిజెపి ప్రభుత్వం కాషాయపు విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింహులు, శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు రామచందర్, మహేష్, రాజు, నాయకులు మల్లేశ్, ప్రభాకర్, దాసు, గంగారాం, సంతోష్, బస్వరాజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో రోహితన వేముల వర్ధంతిని నిర్వహిస్తున్న కెవిపిఎస్ నాయకులు

## పోయిన లగేజీని ప్రయాణికురాలికి తిరిగి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

**సదాశివపేట, జనవరి 17, ప్రభాతవార్త:** బస్సులలో ప్రయాణించేటప్పుడు విలువైన వస్తువులు గల లగేజీని జాగ్రత్తగా చూసుకోవాలని ఆర్టీసీ సదాశివపేట బస్టాండ్ ఇంఛార్జీలు బొంతప్ప, ప్రకాష్ అన్నారు. పోయిందనుకున్న లక్ష్యా 50 వేల విలువగల లగేజిని ప్రయాణికురాలిని గుర్తించి తిరిగి వారికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తితే... మంగళవారం నాడు పటాన్‌చెరు బస్టాండ్ నుండి బుధేర వరకు వెళ్లడానికి జ్యోతి అనే ఒక ప్రయాణికురాలు బస్ నెంబర్ 0221, జహీరాబాద్ డిపో బస్సు ఎక్కి తన లగేజిని బస్సు డ్రైవర్ వెనకాల ఉంచి జ్యోతి (ప్యాసింజర్) లోపల వెనకాల సీటు కాలీ వుండటంతో వెనకాల వెళ్లి తన పిల్లలతో సీట్లో వెళ్లి కూర్చున్నారు. బస్సు పటాన్‌చెరు నుండి సంగారెడ్డి ఎక్స్ రోడ్ కి వచ్చిన బస్సులో ఒక ప్యాసింజర్ జ్యోతి లగేజిని తీసుకుని దిగాడు. తిరిగి బస్సు బయలు దేరింది. జ్యోతి లగేజిని తీసుకున్న ప్యాసింజర్ ఆ లగేజిని తిరిగి సంగారెడ్డి ఎక్స్ రోడ్ బస్టాండ్‌లో ఉంచేసి వెళ్లిపోయాడు. అది గమనించిన సంగారెడ్డి ఎక్స్ రోడ్ బస్టాండ్ కంట్రోలర్ సుధాకర్ వెంటనే సదాశివపేట్ బస్టాండ్ ఇంఛార్జీ జె బొంతప్ప, ప్రకాశ్, శివకుమార్ కి ఫోన్ చేసి లగేజిని మరిచిపోయారని, ఆ లగేజిని సదాశివపేటకు పంపిస్తున్నట్లు చెప్పారు. వెంటనే అలర్ట్ అయిన సదాశివపేట బస్టాండ్ వచ్చిన రెండు బస్సులల్లో ఎక్కి ఎవరిదైనా లగేజ్ మిస్ అయ్యిందా అని అడుగగా జ్యోతి వెంటనే లేచి చూసుకోగా తన లజేజి కనిపించక పోవడంతో తన లగేజి మిస్ అయ్యింది అని తెలపడంతో జ్యోతి సదాశివపేట బస్టాండ్‌లో దించారు. తరువాత వెనకాల వచ్చిన బస్సులో నుండి ఆ లగేజిని దించారు. తరువాత వెనుకల వచ్చిన బస్సులో నుండి ఆ లగేజిని దించుకుని, ఆ లగేజి బ్యాగ్‌లో ఏమి ఉన్నాయని అడుగాగా అందులో 2.5 తులాల బంగారు, 20 తులాల వెండి, పట్టగొలుసులు ఉన్నాయని తెలిపారు. దాని విలువ సుమారు రూ. ఒక లక్ష యాభై వేల ఉంటుందని జ్యోతి భర్త శ్రీశైలం తెలిపారు. తమ లగేజి బ్యాగ్‌ను వారు గుర్తించి తనదే అని తెలుపగా అందులో తమ వస్తువులు జాగ్రత్తగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ వస్తువులు జాగ్రత్తగా ఇప్పించినందుకు సంగారెడ్డి ఎక్స్ రోడ్ కంట్రోలర్ సుధాకర్, సదాశివపేట బస్టాండ్ ఇంఛార్జ్ జె బొంతప్ప, బి ప్రకాష్, ఆర్ఎం ఆఫీస్ రాములు, బస్‌పాస్ కౌంటర్ శివకుమార్‌కి ఎంతో కృతజ్ఞతా భావంతో ధన్యవాదాలు తెలిపారు.

## చౌటపల్లి ప్రజలకు బెంచీల వితరణ

**అక్కన్నపేట, జనవరి 17, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ప్రజలకు కూర్చునేందుకు ఇబ్బందులు అవుతున్నాయని గ్రామసర్పంచ్ గద్దల రమేష్ విజ్ఞప్తి మేరకు ముడికె గట్టయ్యముడికె రవిల స్మారకార్థం వారి కుమార్తె ముక్కెర స్వప్న రమేష్‌లు మంగళవారం ఆరు సిమెంట్ బెంచీలను వితరణ చేసినట్లు గద్దల రమేష్ వెల్లడించారు. గ్రామ ప్రజల కోసం ఇచ్చినందుకు వారికి ముక్కెర రమేష్ దంపతులకు గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ ధన్యవాదాలు తెలియచేసారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**బెజ్జంకి, జనవరి 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెన్నవానిపల్లి గ్రామానికి చెందిన వెన్న దేవయ్య ఇటీవల మరణించడంతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కవ్వంపల్లి సత్యనారాయణ బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అయన వెంట పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, నాయకులు జనగాం శంకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తునికిబొల్లారంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**ములుగు, జనవరి 17 (ప్రభాతవార్త):** చలిలో వణుకుతూ జీవితాలను గడుపుతున్న వృద్ధులకు ములుగు మండల పిఏసిఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిలు దుప్పట్లు పంపిణీచేసి తమ ఉదారతను చాటుకున్నారు. పిఏసిఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిల స్వగ్రామమైన తునికిబొల్లారం గ్రామంలో వృద్ధులు దుప్పట్లు లేక చలికి వణుకుతూ కనిపించడంతో వారి మనసు చలించి మానవసేవయే మాధవ సేవగా భావించి మంగళవారం రోజు గ్రామంలో ఉన్న 350 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు త్వరలో మండల వ్యాప్తంగా చేసే ఆలోచన ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలుగౌడ్, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్వరూప్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేష్‌గౌడ్, మల్లేష్‌ముదిరాజ్, అనిల్‌ముదిరాజ్, నీల బాబు, నరసింహారెడ్డి, నీల నర్సింలు, జమీన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, జనవరి 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన గువ్వ కిష్టమ్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్టల అంజయ్య మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి తాము అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీపతి రాజేశ్వరిరవి, బిఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు లింగాల కనకయ్య, వార్డు సభ్యులు కె.కనకయ్య, గ్రామ కో-ఆప్షన్ సభ్యుడు నర్ర కనకయ్య, యూత్ అధ్యక్షుడు చెక్కల కృష్ణ, మాజీ సర్పంచ్ గువ్వ పోచయ్య, ఎఫ్ఏ నర్సింలు, యువకులు రామచంద్రం, మహేష్, కర్ణాకర్, చందు, బాలయ్య, కృష్ణ, సుధాకర్, కనకరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

**నందిగామ జనవరి17, ప్రభాతవార్త :** వైద్యా ఆరోగ్యరంగానికి ఆయువు పట్టుగా ఉండి గ్రామీణ క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేయాలని నందిగామ మండల బిఎస్పీ ఇంచార్జీ ఎర్రోళ్ల జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదకర కరోనా విపత్కర సమయంలో తమ కుటుంబాలను పక్కన బెట్టి ప్రాణాలను తెగించి ఎం తో మంది ప్రాణాలను కాపాడిన ఎఎన్ఎంలపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రెండు దశబ్దాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయించుకోవడం దుర్మార్గమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 23 ఏళ్లుగా పని చేస్తున్న ఏఎన్ఎంలకు తొలి పీఆర్సీ బేసిక్ ఇవ్వకపోవడంతో ప్రతి నెల రూ.5వేల వరకు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఎంతో మం దికి అహర్నిశలు సేవలందిస్తూ ప్రాణాలు పోస్తున్న ఎఎన్ఎంలను ప్ర భుత్వం తక్షణమే రెగ్యూలరైజ్ చేయాలని లేని యెడల తెలంగాణ రా ష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని ప్రభుత్వా న్ని హెచ్చరించారు.

## దేవాలయంలో ప్రత్యేక పూజలు

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 17, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామంలో ఇటీవల నూతనంగ నిర్మించిన శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రారంబించి 41రోజులు పూర్తి చేసుకు న్న సందర్భంగా గుడిలో హోమాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిం చినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ పెద్దలు స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహి ళలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన చావుకు సత్తయ్య మృతి చెందాడంతో రాజేందర్ రెడ్డి ద్వారా ఈ విషయాన్ని తెలుసు కున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం ఉప్ప ల చారిటుబల్ ట్రస్ట్ నుండి 3వేల రూపాయలను అందజేశారు. ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్ బండేలా రఘువర్ధన్ రెడ్డి, శ్రీరామ్, కృష్ణయ్య, భక్తి రఘు, గాజుల సత్తయ్య, బండేలా వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 17, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మెళనం కార్యక్రమాన్ని నిర్వహించా రు. పాఠశాలలో 2013సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యా ర్థులు అందరు కలిసి అనందంగ గడిపారు. తమ పాఠశాలలో చదువుతున్న తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారందరికి పాఠాలు బోధించిన ఉపా ధ్యాయులను ఆహ్వానించి సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిష్టారెడ్డి, సంగయ్య, రఘు, చెన్నయ్య, మహద్‌ఆలీ, సునిత, శాంతబాయి, నర్సింహులు పాల్గొన్నారు.



అధికారులకు కంటి వెలుగుపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ సుజాత

## రేపటి నుంచి గ్రామాల్లో 'కంటి వెలుగు' : ఎంపిడివో

**ఝరాసంగం, జనవరి 17, ప్రభాతవార్త:** ఈ నెల 19వ తారీఖు నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న కంటి వెలుగు శిబిరాలను కంటి సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామ స్థాయి అధికారులు తమ వంతు కృషి చేయాలని మండల పరివషత్ అభివృద్ధి అధికారి సుజాత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు, విఓఏలకు కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సుజాత మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయితీలో కంటి వెలుగు శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల వివరాలను గ్రామాల్లో టాంటాం ద్వార ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. కన్నుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరు శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా గ్రామ స్థాయి అధికారులు తమ వంతు కృషి సల్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ లక్షణ్, రపంచాయితీ కార్యదర్శులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి రోజున రాష్ట్ర నూతన సచివాలయాన్ని ప్రారంభించాలి

### కాంగ్రెస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ సొంత నిధులతో ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ప్రజల సొమ్ముతో నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నూతన సచివాలయ భవనాన్ని తన పుట్టిన రోజు ప్రారంభించడం సరికాదని డాక్టర్ బి.అర్.అంబేద్కర్ పుట్టిన రోజు ఏప్రిల్ 14న ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, బొమ్మల యాదగిరి, దేవులపల్లి యాదగిరి, డాక్టర లక్కరసు సూర్యచంద్ర వర్మ, ఎం.డి.ఇమామ్(అత్తు)లు అన్నారు. జిల్లా కేంద్రంలో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పేరుకు మాత్రమే సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారని అయన అశయాలకు అనుగుణంగా అంబేద్కర్ జయంతి రోజే సచివాలయాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. అంబేద్కర్ లాంటి మహోన్నత వ్యక్తి పేరు పెట్టి కెసిఆర్ తన పుట్టిన రోజున ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల కోసం పని చేయాల్సిన ప్రభుత్వం పార్టీ మనుగడ కోసం పాటుపడుతుందన్నారు. సభలు, సమావేశాలపై ఉన్న శ్రద్ద ప్రభుత్వానికి ప్రజల సంక్షేమంపై లేదన్నారు. కేంద్రంలోని బిజెపి పాలన, రాష్ట్రంలోని బిఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారని తెలిపారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరగడంతో పాటు దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును విజయవంతం చేయాలి

### ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్, జనవరి 17, ప్రభాతవార్త:** అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 18 వ తేదీ బుదవారం నుండి మండలాల్లోని అన్ని గ్రామాల్లో పట్టణాల్లో కంటి వెలుగు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలందరు తమ నేత్రాలను పరీక్షించుకొని ఏమైనా కంటి సమస్యలుంటే కంటి చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. కాగా అవపరమున్న వారికి కంటి అద్దాల పంపిణీ కూడ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లో ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి లు సూచించారు.

## రంగంపేట గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, జనవరి 17 ప్రభాతవార్త:** రంగంపేట అభివృద్ధికి కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేటలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే మిషన్ భగీరథ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం 5 లక్షల రూపాయలతో ఖబ్రస్థాన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ముస్లింల కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్‌ల మంజూరు కోసం ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కోరగా, మంజూరుకు ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, స్థానిక సర్పంచి బండి సుజాత రమేష్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఎంపీటీసీ గొకని మాధవి రాజాగౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, పంచాయితీ రాజ్ డీఈ అమరేశ్వర్, మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందపురం సావిత్రిరెడ్డి, ఉప సర్పంచి మచ్చ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, కొమ్ముల రవీందర్, దుర్గేష్‌గౌడ్, చిట్కుల సురేష్, గౌస్ పాషా, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఈ నెల 21, 22వ తేదీలలో ఎన్ఎంఏఏ 9వ తెలంగాణ ఛాంపియన్‌షిప్ పోటీలు

**మెదక్, జనవరి 17 ప్రభాతవార్త:** నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఛాంపియన్ షిప్ 2023 పోటీలు ఈ నెల 21, 22వ తేదీలలో మెదక్ పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, ఇఫ్కో డైరెక్టర్ ఎం. దేవేందర్‌రెడ్డి తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక, పరావస్తు శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 679 మంది పాల్గొంటారని తెలిపారు. ఇందులో 531 మంది పరుషులు, 148 మంది మహిళలు పాల్గొంటారన్నారు. 20 ఈవెంట్లలో 14 గ్రూపులుగా 35 ఏళ్ల పైబడిన వారు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ, ఎన్ఎంఏఏ జనరల్ సెక్రటరీ ఆర్. ప్రభు కుమార్‌గౌడ్ ఎన్ఎంఏఏ ట్రెజరర్ డి. లక్ష్మీ, అధ్యక్ష కార్యదర్శులు మధుసూదన్, రాజేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ జయరాజ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**సదాశివపేట, జనవరి 17, ప్రభాతవార్త:** మండలంలోని కొనాపూర్ గ్రామంలో పట్లోళ్ల శివనాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పట్లోళ్ల చంద్రశేఖర్, మేనేజింగ్ ట్రస్ట్ పట్లోళ్ల నందీశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, సంగారెడ్డి డీఎస్పీ రవీంద్రరెడ్డి, తహసీల్దార్ మనోహర చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తూ యువకులకు ప్రోత్సాహాన్ని ఇస్తూ ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారన్నారు. పట్లోళ్ల శివనాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించి దాదాపు 28 టీంలు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ ద్వారా క్రీడలే కాకుండా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని మునుముందు ఇంకా మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. డీఎస్పీ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ యువకులకు క్రీడలు ఎంతో ఉపయోగమని, శారీరక, మానసిక ధృడత్వాన్ని ఇస్తాయని, పోలీసు, ఆర్మీ రిక్రూట్‌మెంట్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, కార్యదర్శి ఆరీఫోద్దిన్, ఎంపిటిసి అల్లం లలిత, కోనాపూర్ గ్రామ సర్పంచ్ గోప్లారం శోభారాణి సంగమేశ్వర్, సర్పంచులు ఏసయ్య, నాగేష్, నవీన్, సలావుద్దిన్, శేఖర్, నాయకులు సుధాకర్, మాణిక్, ఉపసర్పంచ్‌లు రాజు, ప్రసాద్‌గౌడ్, నర్సిములు, ఫౌండేషన్ సభ్యులు సంగమేశ్వర్, లింగన్న, శ్రీనివాస్, రమేష్, సుజనాకర్, సిద్దన్న, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

# ఇంటిపన్నులను నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో ధర్నా



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త :** నూతనంగా ఏర్పడిన రామాయంపేట మున్సిపాలిటీలో ఇంటిపన్నులు పెంచడాన్ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఫ్లకార్డులు చేతపట్టుకొని పెంచిన ఇంటిపన్నులను తగ్గించాలిన నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఇదే విషయంపై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా, పన్నులు తగ్గించడంపై ఎలాంటి స్పందన లేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావులు గ్రామపంచాయతిగా ఉన్న రామాయంపేటను మున్సిపల్‌గాచేస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పడం జరిగిందని, గడిచిన నాలుగు ఏండ్లలో రామాయంపేటలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రోడ్ల విస్తరణ, ప్రజలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో పాటు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో రామాయంపేట అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఎలాంటి అభివృద్ధి లేని రామాయంపేటలో 30వేల వరకు ఉన్న జనాబాకు 100రెట్ల ఇంటి పన్ను పెంచి పేద, సామాన్య ప్రజలపైన అధిక భారం మోపుతున్నారని అన్నారు. పెంచిన ఇంటి పన్నులు వెంటనే తగ్గించకపోతే బిజెపి ఆధ్వర్యంలో ప్రజలతో కలసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. కాగా ధర్నాలో కూర్చున బిజెపి నాయకులు పట్టుకున్న ఫ్లకార్డులలో "అబద్దాల మంత్రి హరీష్‌రావు డౌన్‌డౌన్" అన్న నినాదాలు ఉండడం గమనార్హం. కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేందర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోచమ్మల అశ్విని శ్రీనివాస్, లావణ్య, కార్తిక్, గిరి, సిద్దరాములు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి

### మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్

**నర్సాపూర్, జనవరి 17 ప్రభాతవార్త:** కంటివెలుగు కార్యక్రమాన్ని అధికారు, సిబ్బంది పకడ్బందిగా నిర్వహించాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై సిబ్బందికి, మెప్మా, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్ల సహకారంతో స్వయం సహాయక సభ్యులు వార్డుల వారిగా సమావేశాలు నిర్వహించి కంటి వెలుగు నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతేగాక కంటి వెలుగు శిబిరాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు, ఏర్పాట్లు కల్పించే విదంగా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ కూడళ్ళలో, రేషన్ దుకాణాలవద్ద ,ప్రభుత్వ కార్యాలయాల నోటీస్ బోర్డులలో కంటి వెలుగు కార్యక్రమ వివరాలను ఉంచ బడుతుందని తెలిపారు. ఈ మేరకు మున్సిఫల్ శాఖ, మెప్మా,వైద్య ఆరోగ్య శాఖ మూడు శాఖల సమన్వయంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు తగు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్ సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, వైద్య ఆరోగ్య,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

### -పంచాయతీ కార్యదర్శులకు డిఎల్‌పిఓ సూచన

**న్యాల్‌కల్, జనవరి 17, ప్రభాతవార్త:**

ఈ నెల 19వ తారీఖు నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యేలా పంచాయితీ కార్యదర్శులు తమ వంతు కృషి సల్పాలని డిఎల్‌పిఓ రాఘవరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎల్‌పిఓ హాజరై పంచాయితీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ నెల 19వ తారీఖు నుంచి జూన్ 8వ తేదీ వరకు మండలంలోని ప్రతి పంచాయితీలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు, గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమంపై గ్రామాల్లో టాం-టాం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, మురుగు కాల్వలు శుభ్రంగా ఉండేలా పనులు చేసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, ఎంపిఓ సురేష్, ఏపిఎం కుఏమార్, న్యాల్‌కల్, మిర్జాపూర్(బివ) గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఏ శ్వేతప్రియ, నరేందర్, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

## మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

### -యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

**పాపన్నపేట, జనవరి 17, ప్రభాతవార్త:** గత శాసన సభ ఎన్నికల సందర్భాల్లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేసిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయరని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి గుర్తు చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ జోడో-బూత్ జోడో కార్యక్రమంపై మండల పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన రెండు శాసన సభ ఎన్నికల్లో ఎన్ఎస్ఎఫ్ చక్కర ఫ్యాక్టరీని 100 రోజుల్లో తెరిపిస్తామని, ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామి చేసినా నేటికి ఆ హామీలను ఎమ్మెల్యే అమలు చేయలేదని గుర్తు చేశారు. మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ అభ్యున్నతికి నిధులను మంజూరు చేయించుకోవడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం తథ్యమని, కాంగ్రెస్ జాండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు రమేశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, శ్రీధర్, మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఖలీమ్,అక్బర్, చిన్న, ప్రశాంత్, రమేశ్, జాకార్య, నవీన్‌రెడ్డి, సతీష్, మదుసూధన్, విఠల్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎంపిపి ఆర్థిక సహాయం

**మర్కుక్, జనవరి 17 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నీల రాములు అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపిపి పాండుగౌడ్ మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. వారితో పాటు నీల యాదగిరి, నీల పోచయ్య, నాయకులు రాజు, కృష్ణ, రమేష్, నర్సింలు, కనకయ్య, బాలస్వామిలు ఉన్నారు.

# కొనసాగుతున్న మున్సిపల్ పాలకవర్గం వార్డుల పర్యటన



వార్డులో సమస్యలు వింటున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్, పాలకవర్గం సభ్యులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 17, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేసి, కావాల్సిన అన్ని పనులు పూర్తి చేస్తాం అని అందు కొరకు తమ పాలకవర్గం కృషి చేస్తుందని, అందుకే ప్రతి సోమవారం ఒక వార్డు చొప్పున వార్డుల పర్యటన చేస్తున్నామని చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పాలకవర్గం చేపట్టిన ప్రతి సోమవారం-ఒక వార్డు పర్యటన కార్యక్రమం సోమవారం చేపట్టనుండగా కంటి వెలుగు కార్యక్రమం నేపథ్యంలో నేడు మంగళవా రం నాడు పదకొండవ వారం వార్డు పర్యటన కొనసాగింది. అందులో బాగంగా పాలకవర్గం అంతా కలిసి పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని గొలిపర్తి గ్రామంలో పర్యటించి వార్డు ప్రజలనుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను అధికారులు నోట్ చేసుకుంటూ, అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చైర్మెన్ జితేందర్‌గౌడ్ తెలిపారు. వార్డు పరిధిలో ప్రతి వీధి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణం కొత్తగా పనులు చూపట్టడం గురించి అధికారులకు సూచించారు. అలాగే పెన్షన్ల కోసం కొత్తవారు కూడా దరఖాస్తు చేసుకున్నారని, వారికి కూడా పెన్షన్లు ఇప్పించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో తీరుస్తామని, సమస్యల స్వీకరణ పూర్తిచేసిన తర్వాత పరిష్కార దిశగా చర్యలు చేపడతామని, ఇప్పటివరకు పర్యటించిన వార్డులలో చాలా వరకు చిన్న చిన్న సమస్యలు పరిష్కారం అయినట్లు చైర్మెన్ జితేందర్‌గౌడ్ పేర్కొన్నారు. అవసరమున్నంత వరకు వార్డులోని సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అంతే కాకుండా వార్డులలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వార్డులోని మురికి కాలువల శుభ్రత, వీధిదీపాలు ఏర్పాటు, మిషన్ భగీరథ నీటిసరఫరా తదితర విషయాలలో పనితీరు మెరుగుపరుచుటకుగాను సత్వర చర్యలు చేపడతామన్నారు. స్వల్ప కాలిక సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నామని, దీర్ఘ కాలిక సమస్యలు మున్సిపాలిటీకి మంజూరు కాబడిన నిధులను బట్టి,పాలకవర్గం అందరి సమక్షంలోనే చర్చించి, నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అధికారుల సలహాలతో ఒక క్రమ పద్దతిలో సమస్యలన్నింటిని పూర్తిచేస్తామన్నారు. కాగా 7వ వార్డులో ప్రజలనుండి వచ్చిన ప్రతి సమస్యను వింటూ పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, 7వ వార్డు కౌన్సిలర్ మల్యాల కవితా కిషన్, కౌన్సిలర్స్ బొర్ర అనిల్‌కుమార్, సుందర్‌సింగ్, దేమె యాదగిరి, చిలుక గంగాధర్, నాయకులు దేవుని రాజు, మల్యాల కిషన్, చింతల యాదగిరి, సరాఫ్ శ్యామ్, బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వాటర్ సప్లై ఇన్‌స్పెక్టర్ బొర్ర సురేష్, వార్డు అధికారులు శ్రీనివాస్, ఎల్లయ్యతోపాటు వాటర్ సప్లై సిబ్బంది, ఎలక్ట్రిషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, శానిటేషన్ సిబ్బందితో పాటు వార్డు ప్రజలు, పలువురు పాల్గొన్నారు.

## రేపటి నుంచి కంటి వెలుగు శిబిరాలు

**న్యాల్‌కల్, జనవరి 17, ప్రభాతవార్త:** ఈ నెల 19వ తారీఖు నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల కేంద్రమైన న్యాల్‌కల్, మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏ శ్వేత ప్రియ, నరేందర్‌లు వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి జూన్ 8వ తారీఖు వరకు మండలంలోని ప్రతి పంచాయితీలో కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు కంటి సమస్యలతో సతమయ్యే వారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



నూతన సంవత్సరక్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 17, ప్రభాతవార్త:** పట్టణ ప్రింట్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలండర్‌ను మంగళవారం రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల శివకుమార్, బిఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు చీలమల్లన్న, పెద్దగొల్ల ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, కొండాపూర్ మాజీ ఎంపిపి విఠల్, పట్టణ ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు నల్లొల్ల వెంకటేశంగౌడ్, ఉపాధ్యక్షులు బషీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి నాయికోటి విశ్వనాథం, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి ఒగ్గు గణేష్, కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, శేఖర్, మన్సూర్ అహ్మద్, ఉమర్ ఫారూక్, దేశెట్టి మల్లేశం, వడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టేకూర్‌లో బిఎస్పీ జండావిష్కరణ

**న్యాల్‌కల్, జనవరి 17, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన టేకూర్ గ్రామంలో బిఎస్పీ జండావిష్కరణ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు సంగ్రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టేకూర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే జండావిష్కరణ కార్యక్రమాన్ని పురుష్కరించుకుని మండలంలోని ముంగి చౌరస్తా నుంచి టేకూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర, జిల్లా, అసెంబ్లి నాయకులు, మండల బూత్ కమిటి నాయకులు, స్వేరోలు, స్వేరో అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, బిఎస్పీ అభిమానులు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, ఎస్సీ యువజన సంఘాలు, బీసీ యువజన సంఘాల నాయకులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించాలని సంగ్రామ్ వినతి చేశారు.

## క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం

### -ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి

**కొల్చారం, జనవరి 17 ప్రభాతవార్త:** క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీలకు వారు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన మద్దెల సాయికుమార్ జట్టుకు రూ.10 వేలు, రెండవ స్థానం సాధించిన ఇసికే రాజు జట్టుకు రూ.5 వేల బహుమతులు అందజేశారు. అనంతరం రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి ఆమె భర్త లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం రంగంపేట యువకులకు రెండు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, స్థానిక సర్పంచి బండి సుజాత రమేష్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఎంపీటీసీ గొకని మాధవి రాజాగౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, పంచాయితీ రాజ్ డీఈ అమరేశ్వర్, మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందపురం సావిత్రిరెడ్డి, ఉప సర్పంచి మచ్చ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, కొమ్ముల రవీందర్, దుర్గేష్‌గౌడ్, చిట్కుల సురేష్, గౌస్ పాషా, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## కంటి వెలుగును విజయవంతం చేయాలి : ఎంపిడివో



కంటి వెలుగు నిర్వహణకు భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, జనవరి 17 ప్రభాతవార్త:** నేటి(బుధవారం) నుండి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రఫీఖ్ ఉన్నీసా, వైద్యురాలు సారికలు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు సంగారెడ్డిపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనువైన భవనాలను పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు ఉంటాయన్నారు. గ్రామాల వారిగా ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించి వైద్య శిబిరంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, ఎంపీవో రియాజుద్దీన్, వైద్య సిబ్బంది యాదయ్య, సాయిలు, కార్యదర్శి వెంకట్రాములు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీశీతలామాత ఆలయ వార్షికోత్సవాలు

**నర్సాపూర్, జనవరి 17, ప్రభాతవార్త:** ఈనెల 18 నుండి నర్సాపూర్ పట్టణంలోని రెండు రోజుల పాటు శ్రీశీతలామాత (నల్లపోచమ్మ) 7వ ఆలయవార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హన్మంతు వెంకటరమణారావు, చౌటి జగదీశ్వర్, దండు దశరథ,ఆశన్నోల్ల శ్రీశైలంయాదవ్, ఎల్లపురం శ్రీనివాస్, ఎద్దు మల్లేష్‌యాదవ్,చింతకుంట శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈనెల 18 న బుదవారం శ్రీ శీతలామాతకు ప్రత్యేక పూజలు, లక్ష పుష్పార్చన, అమ్మవారి ఊరేగింపు తీర్థ ప్రసాద వితరణ, 19 న గురువారం చండీయాగం, సామూహిక బోనాల ఊరేగింపు ప్రత్యేకపూజలు, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపూజా కార్యక్రమాలను వేద పండితులు ఆలయ పురోహితులు హరికృష్ణశర్మ, హరిప్రసాద్‌శర్మ బృందం చే వేద మంత్రోచ్ఛరణల మధ్యన కొనసాగుతుందని వారు తెలిపారు. బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త అధ్వర్యంలో నిత్యాన్నాదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ శీతలామాత వార్షికోత్సవ ఉత్సవాలకు నర్సాపూర్ పట్టణ ప్రజలతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## శ్మశాన వాటికలో పనుల ప్రారంభం

**సిద్దిపేట రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని కుషాల్‌నగర్ ఎస్సీ మాల శ్మసన వాటిక అభివృద్ధికి మంత్రి హరీష్‌రావు నిధులు మంజూరి చేసి అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నారని 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ అన్నారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు అదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజులరాజనర్సు సూచన మేరకు శ్మసనవాటికలో అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గతంలో శ్మసన వాటికలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. శ్మసన వాటిక పనులు పూర్తి అయితే ఇబ్బందులు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ పంతం మహేష్, కాంట్రాక్టర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.